



కల్లూరు అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న ఏనుగులు (ఫైల్ ఫొటోలు)

ఏనుగులు పంటలను తరచూ ధ్వంసం చేస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆపై నష్టపరిహారం పొందడానికి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. తీరా వచ్చిన మొత్తం తీసుకుని సరిపెట్టుకుంటున్నారు. ఇటువంటి కష్టాలకు చెక్ పెడుతూ.. రైతులకు అండగా నిలిచేలా.. రాష్ట్ర అటవీ శాఖ 'గజ-ప్రజ' యాప్‌ను తీసుకొచ్చింది. దీన్ని రాష్ట్రంలోనే తొలిసారిగా చిత్తూరు జిల్లాలో అమల్లోకి తేనున్నారు.

- చిత్తూరు సెంట్రల్, ఆంధ్రజ్యోతి

రైతులకు అండగా 'గజ-ప్రజ యాప్'

- పంట నష్టంతోపాటు పశువులు, మనుషులు చనిపోయినా వెంటనే నమోదు
- పరిహారమూ త్వరగా అందుతుంది
- ఏనుగుల సమాచారమూ తెలుసుకోవచ్చు
- రాష్ట్రంలోనే తొలిసారిగా జిల్లాలో అమల్లోకి..

ఫైల్ ట్రాకింగ్

నష్టపోయిన రైతు.. తాను నమోదు చేసిన వివరాలు, ఎంత నష్టపరిహారం నమోదైంది.. తన ఫైల్ ఏ స్థాయిలో, ఏ అధికారి వద్ద ఉందనే విషయాన్ని ఈ యాప్ ద్వారా రైతు నేరుగా తెలుసుకునే వీలుంది.

ప్రస్తుతానికి ఏనుగులకే అనుమతి

రైతులకు పంట నష్టం.. మూడు రకాలైన అడవి జంతువుల ద్వారా జరిగే వీలుంది. ఏనుగులు, అడవి పందులు, దుప్పులు. ప్రస్తుతానికి ఏనుగుల ద్వారా పంట నష్టం వివరాలు మాత్రమే నమోదు చేయడానికి యాప్‌లో వీలు కల్పించారు. భవిష్యత్తులో అడవి జంతువుల కారణంగా పంట నష్టపోతే వాటిని కూడా రైతులు యాప్‌లో నమోదు చేసే వీలు కల్పిస్తారు.

రూపకల్పన ఇలా..

రాష్ట్ర ప్రభుత్వం-అటవీ శాఖ సంయుక్తంగా ఓ ప్రైవేటు ఏజెన్సీ ద్వారా ఈ యాప్‌ను రూపొందించింది. ఆండ్రాయిడ్ మొబైల్‌లో గూగుల్ ప్లేస్టోర్ నుంచి దీన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. డౌన్‌లోడ్ చేసుకున్నాక రైతు తన వ్యక్తిగత వివరాలు, మొబైల్ నెంబరు, రెవెన్యూ రికార్డుల ప్రకారం భూమి, పంట సాగు వివరాలు, వ్యక్తిగత బ్యాంకు ఖాతా వివరాలు నమోదు చేసుకోవాలి. పాస్‌వర్డ్ పెట్టుకునే వెసులుబాటు ఉంటుంది.

నాలుగు శాఖలతో అనుసంధానం

ఈ యాప్ అటవీ, వ్యవసాయ, ఉద్యాన, రెవెన్యూ శాఖలతో అనుసంధానం చేయబడి ఉంటుంది. యాప్‌లో రైతులు సమస్యలు లేవనెత్తినప్పుడు వాటిని ఆయా శాఖలు లాగిన్ల ద్వారా పరిష్కరించే వీలుంటుంది.

పంట నష్టం నమోదు ఇలా..

ఏనుగులు, ఇతర అడవి జంతువుల కారణంగా రైతులు పంట నష్టపోయిన సమయంలో ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఆపై రైతు భూ వివరాలు, సాగు చేసిన పంట, నష్టం, బ్యాంకు వివరాలన్నీ అటవీ శాఖ బీట్ అధికారి లాగిన్‌కు వెళతాయి. బీట్ అధికారి క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసి.. వివరాలు సరిచూసుకుని వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులకు పంపుతారు. ఆయా శాఖల అధికారులు మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించి.. నష్ట పరిహారాన్ని అంచనా వేసి అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి (డీఆర్వో) స్థాయి అధికారికి లాగిన్‌కు పంపుతారు. ఆపై మూడో స్థాయిలో అటవీ శాఖ ఫారెస్టు రేంజ్ అధికారి (ఎఫ్‌ఆర్వో) వివరాలు పరిశీలించి అన్ని సరిగ్గా ఉంటే చివరిగా జిల్లా అటవీ అధికారి (డీఎఫ్‌వో) లాగిన్‌కు పంపుతారు. ఆయన చివరగా ప్రభుత్వానికి నివేదిస్తారు. అక్కడి నుంచి అనుమతి రాగానే ఒక్క క్లిక్‌తో పంట నష్టం మొత్తాలు రైతుల బ్యాంకు ఖాతాలోకి నేరుగా జమవుతాయి. కేవలం పంట నష్టమే కాదు, అడవి జంతువుల వల్ల పశువులు, చివరకు మనుషులు చనిపోయినా ఈ యాప్ ద్వారా నమోదు చేసుకోవచ్చు.

గజ-ప్రజ యాప్ వినియోగంలోకి వస్తే రైతులు ఏ ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పనిలేదు. నష్ట పరిహారం కూడా నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలోకి జమవుతుంది. పంటలే కాదు.. అడవి జంతువుల వల్ల పశువులు, మనుషులు చనిపోయినా యాప్ ద్వారా నమోదు చేసుకోవచ్చు. దీనిపై మూడ్రోజులుగా వైల్డ్ లైఫ్ ఎక్స్‌పర్ట్ రాకేష్ కల్వ జిల్లాలోని అటవీ, వ్యవసాయ, ఉద్యాన, రెవెన్యూ శాఖ అధికారులకు శిక్షణ ఇచ్చారు. త్వరలో అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలు, రైతులకు క్షేత్ర స్థాయిలో ఈ యాప్ వినియోగంపై అవగాహన కల్పించనున్నారు.

ఏనుగుల సంచారాన్ని తెలియజేయవచ్చు

ఏనుగులు తమ పంటలను నాశనం చేయడానికి గ్రామాలకు సమీపించిన సమయంలో రైతులు ఆ సమాచారాన్ని యాప్ ద్వారా అటవీ శాఖ అధికారులకు తెలియజేయవచ్చు. అటవీశాఖ ఉన్నతాధికారులు అప్రమత్తమై వాటిని తిరిగి అటవీ ప్రాంతంలోకి తరలించే చర్యలు వెంటనే చేపడతారు.

త్వరలోనే అవగాహన కార్యక్రమాలు

గ్రామీణ, అటవీ సరిహద్దు ప్రాంతాల్లోని రైతులకు, స్థానిక ప్రజలకు గజ-ప్రజ యాప్‌ను ఎలా ఉపయోగించుకోవాలనే దానిపై అటవీ, వ్యవసాయ, ఉద్యాన శాఖల సంయుక్త ఆధ్వర్యంలో త్వరలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

వీరప్పల్లె గుట్టపై

వైసీపీ నేత క్షుద్రపూజలు

- ఏడుగురి అరెస్టు, పరారీలో మరికొందరు




వీరప్పల్లె గుట్టపై శనివారం రాత్రి నిర్వహించిన క్షుద్రపూజలు

పెద్దపంజాణి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పెద్ద పంజాణి మండలం వీరప్పల్లె గ్రామ సమీపంలోని ఒక గుట్టపై శనివారం రాత్రి వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎర్రబల్లి శ్రీనివాసులు క్షుద్రపూజలు నిర్వహించారు. అతడితోపాటు మరో ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. శ్రీనివాసులు.. వైసీపీకి చెందిన పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సన్నిహితుడు. ఆదివారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెద్దపంజాణి మండలం వీరప్పల్లె గుట్టపై శనివారం రాత్రి ఎవరో క్షుద్రపూజలు నిర్వహిస్తున్నట్లు పలమనేరు అర్బన్, రూరల్ సీఐలు మురళీమోహన్, పరశురాముడికి సమాచారం అందింది. వారిచ్చిన ఆదేశాలతో పెద్దపంజాణి ఎస్ఐ మారెప్ప తన సిబ్బందితో వెళ్లి దాడులు చేశారు. ఘటనా స్థలంలో పెద్దపంజాణి మండలం కెలవాతి గ్రామానికి చెందిన ఎర్రబల్లి శ్రీనివాసులు (50), అతని సోదరుడు వై.శరవణ(43), అనుచరులైన పుంగనూరు మండలం బండ్లపల్లె గ్రామానికి చెందిన బి.శ్రీనివాసులు(47), బి.ప్రకాష్(47), సి.శ్రీనివాసులురెడ్డి(34), తవణంపల్లె మండలం సిద్దంపల్లెకి చెందిన కాణిపాకం రమేష్(30), అన్నమయ్య జిల్లా కలికిరి సమీపంలో ఉన్న బండకిందపల్లెకి చెందిన జె.సునీల్(33)లను అరెస్టు చేశారు. పుంగనూరు మండలం ఎ.కొత్తకోటకు చెందిన శ్రీనివాసులు, చౌడేపల్లెకి చెందిన వినోద్‌కుమార్, చిత్తూరు కట్టమంచికి చెందిన వెంకటేష్, ఎక్స్‌కవేటర్ యజమాని సంతోష్‌రెడ్డి, చిత్తూరుకు చెందిన ఇద్దరు స్వాములు పరారయ్యారు. అక్కడ గుప్త నిధులకోసం తవ్విన గుంతను గుర్తించారు. కారు, ఎక్స్‌కవేటర్, నాలుగు మోటారు సైకిళ్ల స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



క్షుద్రపూజలయ్యాక గుట్టపై గుప్త నిధుల కోసం తవ్విన గుంత

● ఆర్ డి బెస్ట్



ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు: 2,368
నియామక నోటిఫికేషన్ ఇచ్చింది: 1,478
డీఎస్సీకి దరఖాస్తు చేసింది: 23,500 మంది
రాత పరీక్షకు అర్హత సాధించింది: 21,340
పరీక్ష రాసింది: 19,550 - టీచర్లుగా ఎంపికైంది: 1,403
శిక్షణ, కౌన్సెలింగ్‌కు హాజరైంది: 1,394
గైర్హాజరైంది: 7 మంది

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ బడులకు సోమవారం నుంచి 1,394 మంది కొత్త టీచర్లు రానున్నారు. మెగా డీఎస్సీ-2025 కింద ఎంపికైన వీరిని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో నియమించారు. 2018లో టీడీపీ ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ఐదేళ్లలో డీఎస్సీ మాటే ఎత్తలేదు. తాము అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ వేస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు ప్రకటించారు. ఆ ప్రకారం కూటమి అధికారంలోకి రాగానే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,403 మంది ఎంపికయ్యారు. వీరికి సెప్టెంబరు 25న విజయవాడలో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ నియామక పత్రాలు అందజేశారు. అక్టోబరు 3 నుంచి 10వ తేదీ వరకు చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలో శిక్షణ తరగతులు నిర్వహించారు. వీటికి 1394 మంది అభ్యర్థులు హాజరుకాగా.. శిక్షణలో చివరి రెండు రోజులైన గురు, శుక్రవారాల్లో స్థానాల కోసం కౌన్సెలింగ్ నిర్వహించారు. శని, ఆదివారాల్లో పోస్టింగ్ ఆర్డర్లు జనరేట్ అయ్యాయి. కౌన్సెలింగ్ ద్వారా తమకు కేటాయించిన బడుల్లో సోమవారం కొత్త టీచర్లు చేరనున్నారు. కాగా, వివిధ కారణాలతో శిక్షణకు గైర్హాజరైన ఏడుగురికి త్వరలో విజయవాడలో శిక్షణ ఇచ్చి.. కౌన్సెలింగ్ ద్వారా స్థానాలు కేటాయించనున్నారు.

ఇవి వెంట తీసుకెళ్లాలి

కొత్త టీచర్లు కౌన్సెలింగ్ ప్రొసీడింగ్స్ కాపీలు మూడు తీసుకెళ్లాలి. ఒకటివారు పనిచేయనున్న స్కూలుకు, మరొకటి ఎంఈవో కార్యాలయానికి, చివరిది తన వ్యక్తిగత ఫైల్‌లో ఉంచుకోవాలి.

- చిత్తూరు సెంట్రల్, ఆంధ్రజ్యోతి

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఎంపికైన టీచర్లు

నియోజకవర్గం	మొత్తం ఖాళీలు	డీఎస్సీ ద్వారా భర్తీ
చంద్రగిరి	28	14
చిత్తూరు	94	45
జీడీ నెల్లూరు	58	30
కుప్పం	887	579
మదనపల్లె	96	29
నగరి	52	15
పలమనేరు	456	284
పీలేరు	72	42
పుంగనూరు	114	48
పూతలపట్టు	68	39
సత్యవేడు	107	66
శ్రీకాళహస్తి	64	32
తంబళ్లపల్లె	178	116
తిరుపతి	89	55
మొత్తం	2363	1394

ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో రూ.27 లక్షలు

పోగొట్టుకున్న కాంట్రాక్టు ఉద్యోగి

7

షార్ట్ సర్క్యూట్‌తో 9 గొర్రెల మృతి

కృష్ణాపురం రిజర్వాయర్ గేటు ఎత్తివేత



వెదురుకుప్పం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కృష్ణాపురం రిజర్వాయర్‌కు వరద రావడంతో నీటి మట్టం పెరిగింది. దాంతో ఆదివారం సాయంత్రం అధికార యంత్రాంగం ఒక గేటును ఎత్తి.. నీటిని దిగువకు విడుదల చేసింది. ఈ నీరంతా తమిళనాడు ప్రాంతానికి తరలివెళ్లింది.

పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించండి

- న్యాయమూర్తులకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ సూచన 7



జిల్లా కోర్టు ఆవరణలో మొక్క నాటి నీరు పోస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్

ఏడు మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తనం కారణంగా గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా ఏడు మండలాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. మండలాల వారీగా.. పెనుమూరులో 31 మి.మీ చిత్తూరు అర్బన్‌లో 10.2, కుప్పంలో 8.4, గంగాధరనెల్లూరులో 7.2, చిత్తూరు రూరల్‌లో 5.4, బంగారుపాళ్యంలో 1.6, యాదమరిలో ఒక మి.మీ వర్షపాతం నమోదైంది.



పులిచెర్ల మండలంలో జంట ఏనుగులు నేలకూల్చిన కొబ్బరి చెట్టు



రామకుప్పం మండలాన్ని కొన్ని రోజులుగా ఉదయాన్నే మంచు దుప్పటి కప్పేస్తోంది. తెల్లవారు జామున చిరుజల్లులు.. ఆపై పొగమంచు.. తర్వాత మండుటెండలు.. సాయంత్రమైతే చలి వాతావరణం ఉండటంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఆదివారం కూడా ఇదే వాతావరణం నెలకొంది.

- రామకుప్పం, ఆంధ్రజ్యోతి

రామకుప్పం బజారువీధి, ఎగువబైపాస్ రోడ్లపై పొగమంచు



పంటలపై ఆగని 'గజ'దాడులు

పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రధానంగా సోమల, పులిచెర్ల మండలాల్లోని రైతులు, స్థానికులకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి.

- వివరాలు 7లో.. -

మార్కెటింగ్ శాఖకు పెరిగిన ఆదాయం

ఆగస్టులో రూ.66.96లక్షలు వస్తే.. సెప్టెంబరుకంతా రూ.119.48 కోట్లకు చేరిక

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా మార్కెటింగ్ శాఖకు ఏఎంసీల ద్వారా సెప్టెంబరు నెలలో ఆదాయం పెరిగింది. ఆగస్టులో రూ.66.96లక్షల ఆదాయం రాగా, సెప్టెంబరులో రూ.52.52 లక్షలు పెరిగి రూ.119.48 కోట్లకు చేరుకుంది. పలమనేరు ఏఎంసీ ద్వారా అత్యధికంగా రూ.87.19 లక్షలొస్తే.. సోమల ఏఎంసీ ద్వారా అత్యల్పంగా రూ.24వేలు వచ్చింది. ఏఎంసీల వారీగా ఆదాయ వివరాలిలా.. చిత్తూరులో రూ.9.56 లక్షలు, పుంగనూరులో రూ.6.75 లక్షలు, బంగారుపాళ్యంలో రూ.2.61 లక్షలు, నగరిలో రూ.3.56 లక్షలు, కుప్పంలో రూ.6.50 లక్షలు, పెనుమూరులో రూ.84 వేలు, రొంపిచెర్లలో రూ.1.41 లక్షలు, ఎస్ఆర్‌పురంలో రూ.82వేల ఆదాయం సమకూరినట్లు మార్కెటింగ్ ఏడీ పరమేశ్వరన్ తెలిపారు.

వరసిద్ధుడి సేవలో జూనియర్ ఎన్టీఆర్ సతీమణి



ఆలయంలో కుటుంబ సభ్యులతో ప్రణతి

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జూనియర్ ఎన్టీఆర్ సతీమణి ప్రణతి, తన సోదరుడు, సినీ నటుడు నార్నె నితిన్‌తో కలిసి ఆదివారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. వీరిని సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామిదర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు

క్షమాపణ చెప్పిన జనసేన నేత

చిత్తూరు సిటీ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌పై జనసేన నేత, హైరోడ్డు బిల్డింగ్ ఓనర్స్ అసోసియేషన్ నాయకుడు దయారాం అనుచిత వ్యాఖ్యలు చేశారు. శనివారం చిత్తూరులోని ఓ హోటల్లో హైరోడ్డు బిల్డింగ్ ఓనర్స్ అసోసియేషన్ సమావేశం జరిగింది. అక్కడ దయారాం మాట్లాడిన వీడియో వైరల్ అయింది. నిర్వాసితులకు పరిహారం ఇవ్వకుండా హైరోడ్డు విస్తరణ చేసే ఎమ్మెల్యే ఓ పోరంబోకు అని ఆయన చెప్పారు. ఈ వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయింది. దీనిపై ఆదివారం నగరంలో జోరుగా చర్చ నడిచింది. ఎమ్మెల్యేపై బహిరంగంగా ఇలా మాట్లాడటం గురించి టీడీపీ నాయకులు, ప్రజాసంఘాలు మండిపడ్డాయి. దాంతో తప్పనిసరి పరిస్థితుల్లో దయారాం క్షమాపణ చెప్పారు.

గూగుల్ రాకతో విశాఖలో టెక్ విప్లవం

● టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్

చిత్తూరు సిటీ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): గూగుల్ రాకతో విశాఖలో టెక్ విప్లవం వచ్చిందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన గూగుల్ టెక్ సంస్థ విశాఖకు రావడం నవ్యాంధ్రప్రదేశ్‌కు శుభపరిణామమని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సీఎం చంద్రబాబు మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలు తీసుకువచ్చి హైదరాబాద్‌ను ఏవిధంగా అభివృద్ధి చేశారో ఇప్పుడు విశాఖకు గూగుల్‌ను తీసుకువచ్చి ఆంధ్రప్రదేశ్ ముఖచిత్రాన్ని మార్చనున్నారని తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాత టెక్ దిగ్గజాలతో భేటీ అయి, రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చి, యువతకు ఉద్యోగావకాశాలు సృష్టించి, అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందేలా చంద్రబాబు కృషి చేస్తున్నారని ఆ ప్రకటనలో వివరించారు.

ఏకాంబరకుప్పంలో చోరీ



దొంగలు పగలకొట్టిన బీరువా

నగరి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): నగరి పట్టణ పరిధిలోని ఏకాంబరకుప్పానికి చెందిన నీలకంఠం ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నీలకంఠం శుక్రవారం పేటకు వెళ్లి శనివారం సాయంత్రం ఇంటికి వచ్చారు. ఇంట్లోని బీరువా తలుపులు పగలకొట్టి, వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం క్లూస్ టీం సైతం నీలకంఠం ఇంట్లో వేలిముద్రలు సేకరించారు. 124 గ్రాముల బంగారం, 400 గ్రాముల వెండి చోరీకి గురైనట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ విక్రమ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు వెనుక గుట్టు విప్పాలి

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్బీ సుధాకర్‌రెడ్డి

వెదురుకుప్పం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం దేవళంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు వెనుక గుట్టు విప్పాలని పోలీసులను టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్‌బీ సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఈ వ్యవహారంలో వైసీపీ అగ్రనేతలను కాపాడటం కోసం కొందరు పోలీసులు కేసును నీరు గార్చారన్న అనుమానం ఉంది. మూడో తేదీ రాత్రి రెండు గంటలకు విగ్రహానికి నిప్పుపెట్టారని సర్పంచు గోవిందయ్య తప్పుడు ఆరోపణ చేశారు. తర్వాత ఇవే ఆరోపణలు చేసిన మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామిని ఎందుకు విచారించలేదు? ఆయనకు ఎవరైనా తప్పుడు సమాచారం ఇచ్చారా లేక ఆయనే కుట్ర చేశారా అన్న కోణంలో దర్యాప్తు చేయాలి' అని ఆయన డిమాండు చేశారు. గోవిందయ్యకు సహకరించిన వారెవరో కూడా నిగ్గు తేల్చాలని కోరారు.

బుడమలకుంట చెరువుకు గండి



చౌడేపల్లె, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): బుడమలకుంట చెరువు కట్టకు ఆదివారం సాయంత్రం గండి పడి నీరు వృథాగా పోతున్నాయి. గ్రామస్తులు ఈ విషయాన్ని అధికారులకు తెలియజేసినా ఆదివారం కావడంతో స్పందించడం లేదని.. చెరువు కట్ట తెగితే ప్రమాదమన్నారు. గండి పూడ్చడంతోపాటు బలహీనంగా ఉన్న చెరువు కట్ట పనులు, మొరవ మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అదిగదిగో పులి

● వేద వర్సిటీలో సంచారం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలో ఆదివారం రాత్రి చిరుత సంచరించింది. హాస్టల్ వద్ద దీని జాడలు కనిపించాయి. ఈ విషయమై విద్యార్థులు సెక్యూరిటీ సిబ్బందికి సమాచారమిచ్చారు. దీంతో వారు ఉనికిని గుర్తించి సెల్ ఫోన్‌లో చిరుత సంచారాన్ని చిత్రీకరించారు. కొంత కాలం క్రితం ఎస్వీయూ ఏడీ బిల్డింగ్ వెనుక చిరుతను బంధించిన విషయం తెలిసిందే. ఈ ఘటన తర్వాత మళ్లీ యూనివర్సిటీల్లో చిరుత సంచారం ఆందోళన కలిగిస్తోంది. ఒకటి కంటే ఎక్కువ సంఖ్యలో వర్సిటీల పరిసరాల్లో తిరుగుతున్నట్లు భావిస్తున్నారు.

కలెక్టరేట్‌లో నేడు 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తామన్నారు. జిల్లాస్థాయి అధికారులందరూ విధిగా హాజరుకావాలని ఆదేశించారు. అలాగే డివిజన్, మండల స్థాయిల్లోనూ పీజీఆర్ఎస్ నిర్వహించాలన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలోనూ..

జిల్లా పోలీసు కార్యాలయంలోనూ సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీజీఆర్ఎస్ జరుగుతుందని ఎస్పీ తుషార్ డూడి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాధిత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పంటలపై ఆగని 'గజ'దాడులు

ఆందోళనలో సోమల, పులిచెర్ల మండలాల్లోని రైతులు, స్థానికులు





ఏనుగులు తొక్కేసిన వరి పంట- కొత్తూరు వద్ద ధ్వంసమైన పంటలను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో సుబ్బరాజు

సోమల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం కొత్తూరు, పట్రపల్లె రైతుల పొలాల్లో ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. దీంతో రైతులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శనివారం రాత్రి కొత్తూరుకు చెందిన ఎస్.గోవిందరెడ్డి, నాగిరెడ్డి, రమణారెడ్డికి చెందిన వరి పంటను ఐదు ఏనుగులు ధ్వంసం చేయడంతో తీవ్రనష్టం వాటిల్లింది. పలు మామిడి తోటల్లో తిరగాడి కొమ్మలను విరిచేశాయి. ఆదివారం డీఎఫ్‌వో సుబ్బరాజు, పుంగనూరు ఎఫ్ఆర్‌వో శ్రీరాములు.. రైతులతో కలసి ఏనుగులు ధ్వంసం చేసిన పంటలను పరిశీలించారు. నష్టపరిహారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. స్థానికులకు పలు సూచనలిచ్చారు. తెల్లని దుస్తులు ధరించి ఏనుగుల కంట పడొద్దని హెచ్చరించారు. ఆవులపల్లె, పెద్దఉప్పరపల్లె, చారాల అటవీఅధికారులు ఇంద్రాణి, సురేంద్ర, బాలసుబ్రహ్మణ్యం, రామచంద్ర, బీట్ సిబ్బంది, సర్పంచు కోదండరాజు, మాజీ సర్పంచు రెడ్డెమ్మ, టీడీపీ నాయకుడు వేణునాయుడు పాల్గొన్నారు.

కొబ్బరి, మామిడి, వరి, టమోటా పంటలకు తీవ్రనష్టం





ధ్వంసమైన టమోటా తోట- ఏనుగులు విరిచేసిన మామిడి కొమ్మలు

కల్లూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపైనా ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. శనివారం రాత్రి దేవళంపేట పంచాయతీలో పంటలపై జంట ఏనుగులు దాడి చేయడంతో కొబ్బరి, మామిడి, వరి, టమోటా పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. ముందుగా తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని సూరప్పచెరువు నుంచి బయల్దేరిన ఏనుగులు పాళెం మీదుగా దేవళంపేట పంచాయతీ కుమ్మరిపల్లె వద్దకు చేరుకున్నాయి. గ్రామంలోని నారాయణ, ధనంజయనాయుడు, ధర్మేంద్ర, గోపికృష్ణ, చంద్రమోహన్‌కు చెందిన మామిడిచెట్ల కొమ్మలను విరిచేసి.. పశుగ్రాసాన్ని తొక్కేశాయి. అక్కడినుంచి కల్లూరు-పులిచెర్ల రోడ్డును పశ్చిమం వైపున దాటుకుని వీకేపల్లె సమీపానికి చేరుకుని రామయ్యకు చెందిన కొబ్బరిచెట్టును నేలకూల్చాయి. తర్వాత చిన్ననగిరిలోకి వెళ్లి కృష్ణయ్యకు చెందిన టమోటా, కొబ్బరి, పశుగ్రాసాన్ని నాశనం చేశాయి. అనంతరం కల్లూరు- పులిచెర్ల రోడ్డును తూర్పు వైపున దాటుకుని దేవళంపేటలోని సుధాకర్, ప్రభాకర్‌కు చెందిన వరిపంటను ధ్వంసం చేశాయి. దిగుమూర్తివారిపల్లెలోని గురుస్వామికి చెందిన మామిడిచెట్ల కొమ్మలను విరిచేశాయి. ఆపై తూర్పువిభాగం అడవిలోకి చేరుకున్నాయి. ఆదివారం పగలంతా అడవిలోని సూరప్పచెరువు సమీపంలో జంట ఏనుగులు సంచరిస్తున్నట్లు స్థానికులు, రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఏనుగుల బారినుంచి పంటలను రక్షించాలని కోరారు.

దాతలారా.. నా బిడ్డను కాపాడండి

ఓ బాలుడి తల్లి వేడుకోలు



బాధితుడు వెంకటేష్

గంగాధరనెల్లూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): 'దాతలారా.. నా బిడ్డను కాపాడండి' అని ఓ బాలుడి తల్లి వేడుకుంటోంది. గంగాధరనెల్లూరు మండలం తూగుండ్రం పంచాయతీ బాలయ్యకొత్తూరు గ్రామానికి చెందిన నీతూ ఆదివారం మీడియాకు వివరాలు తెలిపింది. నీతూకు నరసింహారెడ్డితో 12 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి వెంకటేష్ (10), చంద్రిక (7) పిల్లలున్నారు. వెంకటేష్ ఏడాది కిందటి వరకు కూడా చలాకీగా ఉండేవాడు. చెల్లెలితో కలిసి తూగుండ్రం ప్రాథమిక పాఠశాలలో చదువుకునేవాడు. ఓ రోజున తిన్న ఆహారం జీర్ణంకాకపోవడం, అప్పుడప్పుడు జ్వరం వస్తుండటంతో చిత్తూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చూపించారు. గ్యాస్ట్రిక్ సమస్య అని, మందులు ఇచ్చారు. రెండు నెలల తర్వాత కడుపు పెద్దదై.. ఉబ్బరంగా మారడం, తిన్న ఆహారం జీర్ణం కాకపోవడం, దగ్గినప్పుడు రక్తం పడటంతో వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించి.. లివర్ సమస్య వల్లే ఇలా జరుగుతోందని గుర్తించారు. లివర్ మార్పిడి చేయాలని చెప్పారు. పైగా వెంటనే ఆపరేషన్ చేయాలనడంతో తల్లి తన లివర్ ఇవ్వడానికి సిద్ధమైంది. అయితే ఆపరేషన్‌కు సుమారు రూ.20లక్షలకుపైగా ఖర్చవుతుందని తెలిపారు. అంత డబ్బు తమ వద్ద లేదని, ఇప్పటికే రూ.8లక్షల వరకు అప్పులు చేశామని ఆ తల్లి కన్నీరు పెట్టుకుంది. ఇటీవల తూగుండ్రం పంచాయతీకి చెందిన టీడీపీ నేతల సహకారంతో రాష్ట్ర ప్రభుత్వవిప్ థామస్‌ను కలిసి సమస్యను తెలియజేశామని చెప్పింది. ఆయన స్పందించి సీఎం దృష్టికి తీసుకెళ్లి ఆదుకుంటామని హామీ ఇచ్చారన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ప్రభుత్వ విప్ థామస్‌తోపాటు మనసున్న దాతలు తమ కుమారుడి ప్రాణాలు కాపాడాలని విజ్ఞప్తి చేశారు. సాయం చేయాలనుకునేవారు ఎ.నీతూ, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, తూగుండ్రం బ్రాంచ్, అకౌంట్ నెంబర్ 642310009951242, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ నెంబర్: యూబీఐఎన్0సీజీ7999, లేదంటే ఫోన్ పే నెంబర్ 93982 26262కు నగదు పంపించవచ్చని వేడుకున్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



మృతి చెందిన జమీర్

పుంగనూరు రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం గుడిసెబండ వద్ద ఆదివారం సాయంత్రం ద్విచక్రవాహనాన్ని మినీ లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. పెద్దపంజాణి మండలం లింగాపురం పంచాయతీ షాపూర్ గ్రామానికి చెందిన మహబూబ్‌బాషా కుమారుడు జమీర్ బాషా(27) భవన నిర్మాణ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. పుంగనూరు నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో పలమనేరు మార్గంలోని కనుమగంగమ్మ గుడి సమీపంలో వెళుతుండగా బోయకొండ నుంచి వస్తున్న మినీ లారీ ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జమీర్‌ను స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించడంతో అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న పుంగనూరు ఏఎస్ఐ అశ్వర్థనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైరెడ్డిపల్లె: మండలంలోని దేవదొడ్డి గ్రామ సమీపంలో ఆదివారం



జస్వంత్‌సింగ్ మృతదేహం

రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పంజాబ్ రాష్ట్రానికి చెందిన జస్వంత్ సింగ్ (50) అనే వ్యక్తి మృతిచెందాడు. కొంతకాలంగా బైరెడ్డిపల్లె సమీపంలో రోడ్డుపనులు చేస్తున్న జస్వంత్‌సింగ్ ద్విచక్రవాహనంలో సురేష్ అనే వ్యక్తితో కలసి వెళుతుండగా దేవదొడ్డి సమీపంలో లారీ ఢీకొంది. ప్రమాదంలో జస్వంత్‌సింగ్ అక్కడికక్కడే మృతిచెందగా మహారాష్ట్రకు చెందిన సురేష్ తీవ్రంగా గాయపడ్డాడు. బైరెడ్డిపల్లె పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. గాయపడిన సురేష్‌ను కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తజన సంద్రం...బోయకొండ

● సేవా టిక్కెట్లతో ఒక్కరోజే రూ.14 లక్షల ఆదాయం





అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో వేచియున్న భక్తులు

చౌడేపల్లె, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం గంగమ్మ భక్తులతో భక్తజనసంద్రంగా మారి అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో గంటల సమయం క్యూలైన్లలో వేచిఉన్నారు. దర్శనం కోసం మధ్యాహ్నం 4 గంటల వరకు క్యూలైన్లలో రద్దీ కొనసాగింది. సుమారు 25వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. వివిధ సేవా టిక్కెట్లతో ఒక్కరోజే రూ.14 లక్షల ఆదాయం చేకూరింది. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ ఈవో, డిప్యూటీ కమిషనర్ ఏకాంబరం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించండి

● న్యాయమూర్తులకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ సూచన



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్‌ను సన్మానిస్తున్న రాష్ట్ర న్యాయశాఖ ఉద్యోగుల సంఘ నేతలు

చిత్తూరు లీగల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కోర్టుల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లోని కేసులను త్వరగా పరిష్కరించాలని న్యాయమూర్తులకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ సూచించారు. జిల్లా కోర్టు ఆవరణలో ఆదివారం చిత్తూరు జిల్లా న్యాయమూర్తులతో ఆయన సమీక్షించారు. కేసులు త్వరగా పరిష్కారమైతే కక్షిదారులు ఇబ్బందులకు గురికారన్నారు. అనంతరం పలు కేసుల తీర్పులపై సూచనలు, సలహాలు ఇచ్చారు. అంతకుముందు కోర్టు ఆవరణలో ఆయనకు పోలీసులు గౌరవవందనం చేశారు. అనంతరం కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి అరుణ సారికతో పాటు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలువురు న్యాయమూర్తులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తికి సన్మానం

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్‌ను న్యాయశాఖ ఉద్యోగుల సంఘం నాయకులు ఆదివారం జిల్లా కోర్టు ఆవరణలో కలిసి సన్మానించారు. అనంతరం వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు గోపీనాథ్ రెడ్డి, లక్ష్మీపతి, రవీంద్రారెడ్డి, సుందర్, గణేష్, పవన్ కుమార్, హరికృష్ణ, సంతోష్, యువరాజు, రెడ్డెప్ప, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

'పీఆర్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్' నూతన కార్యవర్గం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

చిత్తూరు రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏపీ పంచాయతీరాజ్ (పీఆర్) మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా శశిధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శిగా చెంచురత్నం యాదవ్, కోశాధికారిగా చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లుగా లక్ష్మీపతి యాదవ్, గిరిధర్‌రెడ్డి, చక్రపాణి, త్రివిక్రమరావు, ఉపాధ్యక్షులుగా మూర్తి, వాణి, లోకేష్, కుమార్, సంయుక్త కార్యదర్శులుగా ఆలీ, లక్ష్మీనారాయణ, కార్యవర్గ సభ్యులుగా కుమార్, తులసీరాం, లోకేష్, మోహన్‌మురళి ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో రూ.27 లక్షలు

పోగొట్టుకున్న కాంట్రాక్టు ఉద్యోగి

చిత్తూరు అర్బన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో ఓ కాంట్రాక్టు ఉద్యోగి రూ.27 లక్షలను పోగొట్టుకున్నాడు. ఆదివారం బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ నెట్టికంఠయ్య కథనం మేరకు.. చిత్తూరు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగంలో ఆలీ.. కాంట్రాక్టు పద్ధతిపై కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో తక్కువ మొత్తంలో డబ్బు పెడితే అధిక మొత్తంలో వస్తాయని పలు బినామీ కంపెనీలు ఆశ పెట్టాయి. నమ్మిన ఆలీ కొంతకాలంగా రూ.27లక్షల వరకు పెట్టుబడి పెట్టాడు. విడతల వారీగా చెప్పిన మొత్తంలో డబ్బులిస్తామని చెప్పిన కంపెనీలు కొన్ని రోజులుగా స్పందించడం లేదు. దాంతో బాధితుడు ఆదివారం రెండో పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇటువంటి వాటికి అందరూ దూరంగా ఉండాలని ఈ సందర్భంగా సీఐ నెట్టికంఠయ్య సూచించారు. లేదంటే కష్టపడిన సొమ్ము పోగొట్టుకుంటారన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో 9 గొర్రెల మృతి



ఐరాల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): షార్ట్‌సర్క్యూట్ కారణంగా 9 గొర్రెలు మృతి చెందిన సంఘటన ఐరాల మండలంలోని చిగరపల్లెలో ఆదివారం వేకువ జామున జరిగింది. గ్రామానికి చెందిన రైతు ఏసు శనివారం రాత్రి తన గొర్రెలను ఇంటి ముందు ఇనుప కంచెతో ఏర్పాటు చేసుకున్న ప్రాంతంలోకి తోలాడు. తన ఇంటి నుంచి అక్కడికి విద్యుత్ లైను లాగి లైట్లు వెలిగించేవాడు. ఈ క్రమంలో ఇంటి నుంచి తీసిన విద్యుత్ కనెక్షన్ తెగి ఇనుపకంచెపై పడింది. దీంతో షార్ట్‌సర్క్యూట్ అయ్యి గొర్రెలు మృతి చెందాయి. పశువైద్యులు పినాకపాణి సంఘటనా స్థలానికి విచ్చేసి గొర్రెలకు పోస్టుమార్టం నిర్వహించారు. రైతుకు సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లింది.

పెండింగ్ జీతాలు విడుదల చేయాలి

అతిథి అధ్యాపకుల డిమాండు



సమావేశంలో పాల్గొన్న సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేశ్, అతిథి అధ్యాపకులు

కుప్పం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న జీతాలను వెంటనే విడుదల చేయాలని జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులు డిమాండ్ చేశారు. కుప్పంలోని జ్ఞానానంద ఆశ్రమంలో ఆదివారం అతిథి అధ్యాపకుల సమావేశం జరిగింది. తెలుగుదేశం ఆధ్వర్యంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ ఏడాది మే నెలలో తమ వేతనాన్ని రూ.10 వేల నుంచి రూ.27 వేలకు పెంచడంపై హర్షం వ్యక్తం చేశారు. పెరిగిన వేతనాలతోపాటు గత విద్యా సంవత్సరానికి సంబంధించిన వేతనాలు తమకు ఇంకా అందలేదని అతిథి అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల అతిథి అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేశ్ మాట్లాడుతూ జీతాలు పెంచినందుకు కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. అయితే పెంచిన జీతాలతోపాటు గత విద్యా సంవత్సరం వేతనాలు కూడా అందక తమ కుటుంబాలు పస్తులుండాల్సి వస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తమ సమస్యలపై స్పందించి వెంటనే పెండింగు జీతాలను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే తమకు సాధారణ సెలవులు, మెటర్నిటీ సెలవులు కల్పించాలని, పదేళ్లుగా సేవలు అందిస్తున్నామని.. ఎంప్లాయి హెల్త్ కార్డులు మంజూరు చేయాలని విన్నవించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. సమావేశంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల అతిథి అధ్యాపకుల సంఘం రాష్ట్ర కోశాధికారి సుధాకర్, జిల్లా అధ్యక్షుడు ఆర్.కుమార్, ప్రధాన కార్యదర్శి రజనీకాంత్, కోశాధికారి బాలకృష్ణ, రామన్, గాయత్రి, సుజాత, శోభ, జిల్లాలోని అతిథి అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

డీఏ బకాయిలు మంజూరు చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న వి.గురురాజారావు

పలమనేరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 13 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ప్రభుత్వం దీపావళికైనా డీఏ బకాయిలు మంజూరు చేయాలని ప్రభుత్వ పెన్షనర్ల సంఘ అధ్యక్షులు వి. గురురాజారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం పలమనేరులోని ఎన్జీవో భవన ఆవరణలో జరిగిన నియోజకవర్గ పెన్షనర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2018 నుంచి చెల్లించాల్సిన డీఏలు, బకాయిలు దాదాపు రూ.30 వేల కోట్ల వరకు ప్రభుత్వం బకాయి పడి ఉందన్నారు. ఉద్యోగ విరమణ తరువాత గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లించకపోవడం తో పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రత్యేకించి పెన్షనర్లు 2018 నుంచి ఈనాటి వరకు వేల మంది చనిపోయినా వారికి సంబంధించిన వారసులకు బకాయిలు చెల్లించకపోవడం దారుణమన్నారు. సమావేశంలో పెన్షనర్ల సంఘ నాయకులు వీరభద్రగౌడు, మోహన్, గురుస్వామి నాయుడు, నాగభూషణం, సాంబయ్య, సోమశేఖర్, బాలసుబ్రహ్మణ్యం, పురుషోత్తం, రామానాయుడు, రెడ్డెమ్మ, భద్రమ్మ, నిజాంసాహెబ్, వినాయకం, సుబ్రహ్మణ్యం, మస్తాన్, జగదీష్, లక్ష్మీదేవి, సుబ్రహ్మణ్యంశెట్టి, రెడ్డెప్ప, నారాయణ రెడ్డి, నజీర్‌బాషా, స్వామినాథన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పద్మవ్యూహం..!



చౌడేపల్లెలో ట్రాఫిక్

- చౌడేపల్లెలో విస్తరణకు నోచుకోని రహదారులు
- రోడ్లను ఆక్రమించిన వ్యాపారులు
- నిత్యం తప్పని ట్రాఫిక్ కష్టాలు
- పట్టించుకోని అధికారులు, పోలీసులు



వాహనాలతో
చౌడేపల్లె బస్టాండులో ట్రాఫిక్

చౌడేపల్లె, అక్టోబర్ 12 (ఆంధ్రజ్యోతి): చౌడేపల్లె పట్టణంలో వాహనాల రద్దీకి అనుగుణంగా రహదారులు విస్తరణకు నోచుకోకపోవడం, రోడ్లకు ఇరువైపులా ఆక్రమణలు పెరిగిపోవడంతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఉదయం, సాయంత్రం, రాత్రి సమయాల్లో ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులతో పాటు ప్రజలు సైతం తీవ్ర అవస్థలు పడుతున్నారు. చౌడేపల్లెలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. ఇరుగైన రోడ్లతో ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు తరచు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పుంగనూరు-తిరుపతి ప్రధాన రహదారిలోని పాత పోలీస్ స్టేషన్ నుంచి తిరుపతి రోడ్డులోని చౌడేశ్వరీదేవి ఆలయం వరకు రోడ్డు ఆక్రమణలు అధికం కావడంతో రోడ్డు ఇరుకుగా మారి పోయింది. ఎదురుగా వాహనాలు వస్తే దారివ్వడానికి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. మోటారువీధిలోని వైశ్యాబ్యాంక్, కెనరా బ్యాంక్‌ల వద్ద రోడ్డుపక్కన, అదే రోడ్డులో ఉన్న ఆంజనేయస్వామి ఆలయం ఎదుట, మెడికల్ షాపులు తదితర ప్రాంతాల్లో కనీసం ద్విచక్రవాహనం రోడ్డు పక్కన పార్కింగ్ చేసినా వాహనాల రాకపోకలకు ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. రెవెన్యూ రికార్డుల్లో సుమారు 60 నుంచి 80 అడుగులు వెడల్పు ఉన్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం కనీసం 25 అడుగుల వెడల్పు సైతం రోడ్డు లేకపోవడంతో తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. గతంలో చౌడేపల్లెకు చెందిన ఓ వ్యక్తి రోడ్డు దురాక్రమణలపై కేసు వేసినప్పుడు రెవెన్యూ అధికారులు, ఆర్ అండ్ బీ అధికారులు తూతూమంత్రంగా ఆక్రమణలు తొలగించారు. ఆ తర్వాత వారం కాకుండానే రోడ్డు ఆక్రమణలు యథాతథంగా మారాయి. పాత పోలీస్‌స్టేషన్ నుంచి బస్టాండు వరకు నిరుపయోగంగా ఉన్న 5 చింతచెట్లు తొలగిస్తే కొంత మేరకు రోడ్డు వెడల్పు అవుతుంది. అలాగే బస్టాండు నుంచి చౌడేశ్వరీదేవి ఆలయం వరకు రోడ్డు ఇరుకుగా మారడంతో ట్రాఫిక్ కష్టాలు తీరడం లేదు. గతంలో పుంగనూరు నుంచి రొంపిచర్ల వరకు 4 లైన్లరోడ్డు మంజూరైందని, పలుమార్లు రెవెన్యూ అధికారులు సర్వేలు నిర్వహించారే తప్ప రోడ్డు విస్తరణ జరగలేదు. ట్రాఫిక్ సమస్యలు ఉన్న బస్టాండులో కనీసం ట్రాఫిక్ కంట్రోల్ చేయడానికి పోలీసులు సైతం పట్టించుకోకపోవడంతో తరచూ ట్రాఫిక్‌తో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా కూటమి నాయకులు, ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం



రామకుప్పంలో రక్తపరీక్ష శిబిరాన్ని ప్రారంభిస్తున్న నేతలు

రామకుప్పం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ సీతాపతి తెలిపారు. ఆదివారం రామకుప్పం పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో యూనివర్సల్ హెల్త్‌కేర్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత రక్తపరీక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఉదయం 8గంటల నుంచి 11.30 గంటల వరకు నిర్వహించిన ఈ శిబిరంలో 47 మంది రక్త నమూనాలిచ్చారు. సోమవారం ఉదయం స్థానిక శివాజీనగర్ కాలనీలో శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. రక్త నమూనాలిచ్చేవారు పరగడుపున ఆధార్‌కార్డులతో శిబిరానికి హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో నేతలు బద్రీనాథ్, అల్లీశీన, నిసార్, చాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదం పరిష్కారం



గ్రామంలో వివాద పరిష్కారం కోసం
నిర్వహించిన పంచాయితీ

కుప్పం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం ఉర్లవోబనపల్లెలో ఇరువర్గాల మధ్య ఏళ్లతరబడి కొనసాగుతున్న భూ వివాదం పరిష్కారమైంది. గ్రామంలో ఆదివారం దళిత నాయకులు కన్నన్, మురుగేశ్ తదితరులు గ్రామ పెద్దల సమక్షంలో ఇరువర్గాలను ఒప్పించి సమస్యను సామరస్యంగా పరిష్కరించారు. వివాదం పరిష్కారమవడంతో ఆయా వర్గాలతోపాటు గ్రామస్తులు కూడా ఆనందం వ్యక్తం చేశారు.

ఏటిగడ్డిండ్లకు రూ.4 కోట్లతో సీసీరోడ్డు పనులు



సిమెంట్‌రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాగరాజరెడ్డి తదితరులు

పలమనేరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మండలంలోని గోవర్ధన డెయిరీ నుంచి ముసలిమడుగు సమీపంలోని ఏటిగడ్డిండ్లు గ్రామానికి రూ.4 కోట్లతో సీసీ రోడ్డు పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఆదివారం పనులకు టీడీపీ మండలాధ్యక్షులు నాగరాజరెడ్డి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ అధ్యక్షులు రామచంద్రనాయుడు, కాంట్రాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ నాయకులు జయప్రకాష్, బాబు, రఘునాయుడు, వేలు, సోము, సుబ్రహ్మణ్యం నాయుడు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పీజీఆర్ఎస్

కుప్పం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండల సచివాలయంలోని సమావేశపు హాలులో సోమవారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు కడా పీడీ వికాస్ మర్మత్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహిస్తున్నట్లు కడా కార్యాలయ వర్గాలు తెలిపాయి. అర్జీదారుల సమస్యలు విని, ఆయా శాఖల అధికారుల ద్వారా పరిష్కరించడానికి పీడీ చర్యలు తీసుకుంటున్నారన్నారు. నియోజకవర్గంలోని ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వీధి దీపాల సమస్యకు పరిష్కారం



వీధిదీపాలు మార్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

కుప్పం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని డీకేపల్లె ప్రాంతంలో వీధి దీపాలు వెలగకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావుకు ఫిర్యాదు అందడంతో ఆదివారం ఆయన స్వయంగా సంబంధిత ప్రాంతాన్ని సందర్శించారు. సిబ్బందిచే పాడైపోయిన వీధి దీపాలను తొలగించి వాటి స్థానంలో కొత్త దీపాలను వేయించారు. స్థానికుల నుంచి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి హామీ ఇచ్చారు.

పంచాయతీ కార్యదర్శికి పదోన్నతి



నాగరాజు

కల్లూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శి గుండ్లూరి నాగరాజుకు డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ వీఆర్ కృష్ణతేజ శనివారం ఉత్తర్వులిచ్చారు. గుండ్లూరి నాగరాజుకు పదోన్నతి కల్పిస్తూ చిత్తూరు జిల్లాకు కేటాయించినట్లు ఆయన తెలిపారు.

15న వాహనాలకు వేలం

వి.కోట, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): వి.కోట అర్బన్ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ కేసులో పట్టుబడిన ఆరు వాహనాలకు 15న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు సీఐ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. ఒక లగేజీ ఆటో, 3 పల్సర్ ద్విచక్ర వాహనాలు, 1 స్ప్లెండర్, ఒక యాక్టివా, షైన్ ద్విచక్ర వాహనాలకు వేలం నిర్వహిస్తామన్నారు. చిత్తూరు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో జరిగే వేలంలో పాల్గొన దలచిన వారు ముందుగా నిర్ణీత మొత్తం డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

కంటి వైద్యశిబిరానికి స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

బైరెడ్డిపల్లె, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆరోగ్యసేవా సంస్థ ఆధ్వర్యంలో శంకర నేత్రాలయ వైద్యులచే నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యనిపుణులు దాదాపు 50 మందికి కంటిపరీక్షలు నిర్వహించి 25 మందిని శస్త్రచికిత్సలకు ఎంపికచేశారు. గతంలో శస్త్రచికిత్సలు చేయించుకున్న వారికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మురళీకృష్ణ, శ్రీనివాసులు, రమణ, గంగాధరం, చంద్ర, చిన్నప్ప పాల్గొన్నారు.

24లోపు రైతులు ఈక్రాప్ నమోదు చేసుకోవాలి

పుంగనూరు రూరల్, అక్టోబరు12 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటలకు సంబంధించి ఈనెల 24తేదీ లోపు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని పుంగనూరు వ్యవసాయశాఖ ఏడీఏ శివకుమార్ రాజు తెలిపారు. రైతులు వేసిన పంటలను ఈక్రాప్ నమోదు చేసుకోవడంతో పంట నష్టాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, ప్రభుత్వ పథకాలను పొందడానికి అవకాశం ఉంద కోరారు.

అందరూ ఆరోగ్యంగా ఉండాలి



తులసినాయనపల్లెలో రక్తపరీక్షా
శిబిరాన్ని సందర్శించిన టీడీపీ నేతలు

రామకుప్పం/శాంతిపురం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ శాంతిపురం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉదయ్‌కుమార్, మంజునాథ్‌గౌడు తెలిపారు. ఆదివారం మండల పరిధి తులసీనాయనపల్లెలో నిర్వహించిన ఉచిత రక్తపరీక్ష శిబిరాన్ని వారు సందర్శించారు. కార్యక్రమంలో నేతలు చంద్రశేఖర్, సింగిరిశ్రీనివాసులు, లోకేశ్ పాల్గొన్నారు.

ముడిపాపనపల్లె చెరువు గండికి మరమ్మతులు



గండిని పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్ శమిపతియాదవ్,
ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు

పుంగనూరు రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న వర్షాలకు పుంగనూరు మండలం ముడిపాపనపల్లె చెరువు కట్ట బలహీనంగా ఉంటూ గండి పడుతుండగా వెంటనే పుంగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నల్లబాల శమిపతియాదవ్ చొరవతో గండిపూడ్చే పనులు ఆదివారం చేపట్టారు. చెరువుకు గండిపడి నీరు వెళ్లిపోతాయనే విషయాన్ని శమిపతి ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో పుంగనూరు ఇరిగేషన్ డీఈ బాబు రాజేంద్రప్రసాద్, జేఈ దీప, వీఆర్వో భాస్కర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని చెరువును, గండి పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. గ్రామంలోని రైతులు ఆంజియాదవ్, వెంకటరమణ, మణి, శివలతోపాటు గ్రామస్తులు ఇసుక బస్తాలు చెరువు వద్దకు చేర్చి పనులు చేపడుతున్నారు.

మహతి ఫౌండేషన్‌కు ఉత్తమ సేవా అవార్డు



ఉత్తమసేవా పురస్కారం అందుకుంటున్న
మహతి ఫౌండేషన్ ప్రతినిధి శాంతమ్మ

బైరెడ్డిపల్లె, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో విద్య, వైద్య, సామాజిక సేవాకార్యక్రమాలు విస్తృతంగా చేస్తున్న బైరెడ్డిపల్లె మహతి ఫౌండేషన్ చైర్మన్ నాగరాజుకు ఉత్తమసేవా పురస్కారం లభించింది. తిరుపతిలో వే ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని మహతి ఫౌండేషన్ ప్రతినిధి శాంతమ్మ అందుకున్నారు.

కృష్ణవేణికి మహిళా శక్తి పురస్కారం



మహిళా శక్తి పురస్కారం
అందుకుంటున్న మాజీ ఎంపీపీ కృష్ణవేణి

బైరెడ్డిపల్లె, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె మాజీ ఎంపీపీ కృష్ణవేణి మహిళా శక్తి పురస్కారం అందుకున్నారు. కృష్ణవేణి చేసిన సామాజిక, సేవా కార్యక్రమాలకు ప్రోత్సాహకరంగా తిరుపతిలో మహతి ఆడిటోరియంలో ఆదివారం వే ఫౌండేషన్ వారు నిర్వహించిన కార్యక్రమంలో పురస్కారాన్ని అందజేశారు. కృష్ణవేణిని పలువురు అభినందించారు.

త్వరలోనే ఏఐ, డిజిటల్‌టెక్‌లో విశాఖ మార్గదర్శకం

- మాజీ ఎమ్మెల్సీ గౌనివారి

రామకుప్పం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): నాడు సీఎంగా చంద్రబాబు హైదరాబాదును ఐటీ రంగానికి ప్రపంచానికి మార్గదర్శిగా నిలిపారని, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో త్వరలో విశాఖపట్టణం ఏఐ, డిజిటల్‌టెక్ రంగాల్లో మార్గదర్శిగా నిలుస్తుందని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అప్పట్లో మైక్రోసాఫ్ట్‌తో రాకతో హైదరాబాదు ఐటీరంగంలో ఎలా గేమ్‌చేంజర్ అయ్యిందో, ప్రస్తుతం గూగుల్‌టెక్ సంస్థ రావడంతో విశాఖపట్టణం మరో గేమ్‌చేంజర్‌గా నిలుస్తుందని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో అన్నిరంగాల్లో సర్వతోముఖాభివృద్ధి చెందాలన్న ధ్యేయంతో సీఎం చంద్రబాబు, మంత్రి నారాలోకేశ్ పరిశ్రమల ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని, వారి కృషిలో భాగమే విశాఖకు గూగుల్‌టెక్, అమరావతికి క్వాంటం వ్యాలీ వచ్చిందన్నారు. వాటితోపాటు మరిన్ని దిగ్గజ సంస్థలు తమ పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్నాయన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో వచ్చిన పెట్టుబడుల కంటే ఎన్డీయే ప్రభుత్వం 16 నెలల పాలనలోనే అధిక పెట్టుబడులు వచ్చాయని పేర్కొన్నారు. పరిశ్రమల స్థాపనకు అనువైన వాతావరణం కల్పించడం, సమర్థవంతమైన నాయకత్వం ఉండటంతో సాధ్యమైందని తెలిపారు.

తులసినాథం నాయుడికి సన్మానం



తులసినాథం నాయుడును
సన్మానిస్తున్న ఎన్.ముక్తేశ్వరరావు

పలమనేరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పలమనేరుకు చెందిన తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు పి.తులసినాథం నాయుడును ఆదివారం ఘనంగా సన్మానించారు. తిరుపతికి చెందిన విశ్వసాహితీ సమాఖ్య వార్షికోత్సవం సందర్భంగా తిరుపతి రాస్ భవనంలో జరిగిన కార్యక్రమంలో విశ్రాంత ఐ ఏఎస్ అధికారి ఎన్. ముక్తేశ్వరరావు, ఆచార్య గార్లపాటి దామోదరనాయుడు, శతావధాని ఆముదాల మురళీ, మౌనిలు తులసినాథం నాయుడు సేవలను గుర్తించి సత్కరించారు.

ఘనంగా ఆయుధ పూజ



సోమల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సోమల పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఆయుధ పూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్‌ను సుందరంగా విద్యుత్ దీపాలంకరణ, పచ్చని తోరణాలతో అలంకరణలు చేశారు. కార్యాలయంలోని పూజామందిరంలో ఆయుధాలకు పూజలు నిర్వహించారు. ఎస్ఐ శివశంకర, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

దేశాభివృద్ధే ఆర్ఎస్ఎస్ లక్ష్యం



కవాతు నిర్వహిస్తున్న
ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

కల్లూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడమే ఆర్ఎస్ఎస్ లక్ష్యమని ఆర్ఎస్ఎస్ సంఘ ప్రతినిధులు రవీంద్ర, కుమార్, వినాయక, శివ తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం ఆర్ఎస్ఎస్ శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా బజారువీధిలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు కవాతు నిర్వహించారు. భారత్ మాతాకీ జేజేలు అంటూ నినాదాలు చేశారు. అనంతరం కల్యాణ మండపంలో సమావేశమ్యారు. ప్రముఖ వ్యాపారవేత్త శంకర్ నారాయణ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పార్థసారధి, అనిల్‌కుమార్, బాలాజీ, మహేష్, ఢిల్లీబాబు నాయుడు, అరుణ్‌కుమార్, కేశవ, అరుణ్, రమణ, ప్రవీణ్, నరేష్ పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



45 ఏళ్ల అనంతరం ఒక్కటైన పూర్వవిద్యార్థులు

బైరెడ్డిపల్లె, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో 1979-80వ సంవత్సరం పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం స్థానిక హెచ్‌వీఎస్ కల్యాణ మండపంలో జరిగింది. గత స్మృతులను గుర్తుచేసుకుంటూ స్నేహితులందరూ ఒకరినొకరు ఆత్మీయ పలకరింపులతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువు రామచంద్రయ్యను ఘనంగా సత్కరించి ఆశీర్వాదం అందుకున్నారు. ఆట పాటలతో సందడిగా గడిపారు. కార్యక్రమంలో పలువురు పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు



మరమ్మతులు చేసిన మ్యాన్‌హోల్స్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చిత్తూరు రూరల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని మిట్టూరుకు వెళ్లే రహదారిలో రెండు మ్యాన్ హోల్స్ మూత లేక ప్రమాదకరంగా ఉండేవి. ఈ మార్గంలో ప్రయాణించిన వాహనదారులు ప్రమాదాలు బారిన పడుతున్నారు. దీనిపై ఈ నెల 6వ తేదీన ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'ప్రమాదకరంగా మ్యాన్‌హోల్స్' అనే వార్త ప్రచురితమైంది. స్పందించిన నగరపాలక అధికారులు మ్యాన్‌హోల్‌లకు మరమ్మతులు చేశారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం



చెక్కును విరాళంగా అందిస్తున్న గీర్వాణి చంద్రప్రకాష్ దంపతులు

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి ఆదివారం సాయంత్రం టీడీపీ నేత గీర్వాణి చంద్రప్రకాష్ దంపతులు రూ.1,01,116 చెక్కు రూపంలో విరాళంగా అందించారు. విరాళదాతను ఏఈవో రవీంద్ర బాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాణిపాకం మాజీ సర్పంచ్ మధుసూదనరావు, సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు. కాగా స్వామి వారిని ముంబాయి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సిద్నా కుటుంబ సమేతంగా ఆదివారం సాయంత్రం దర్శించుకున్నారు.

బంగారుపాళ్యం జనసేన అధ్యక్షుడి రాజీనామా



కోడి చంద్రయ్య

బంగారుపాళ్యం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మండల జనసేన పార్టీ అధ్యక్షుడు కోడి చంద్రయ్య తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను జనసేన పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశానని, మండలంలోని 41 పంచాయతీల్లో పార్టీ బలోపేతానికి శ్రమించానని చెప్పారు. గతంలో చిరంజీవి ఏర్పాటు చేసిన ప్రజారాజ్యం పార్టీ ఆవిర్భావం నుంచి కూడా తాను పని చేసినట్లు తెలిపారు. జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్ మండలంలోని కొంత మందికి తనకు తెలియకుండానే పదవులు కట్టబెడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గుర్తింపు లేని చోట తాను ఉండలేనని చెప్పారు. తన రాజీనామాకు జిల్లా అధ్యక్షుడే కారణమని చంద్రయ్య తెలిపారు. తన రాజీనామా లేఖను అధిష్ఠానానికి పంపినట్లు పేర్కొన్నారు.

నేడు దేశమ్మ ఆలయ పాలకమండలి ప్రమాణ స్వీకారం



రత్నవేలు మణి

నగరి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): నగరి పట్టణ పరిధిలోని టీఆర్ కండ్రిగలో గల నేత్ర ప్రదాయని దేశమ్మ దేవాలయ పాలకమండలి కమిటీ చైర్మన్‌గా కడంబూరు రత్నవేలు మణి మొదలియార్ సోమవారం ఉదయం 9 గంటలకు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. పాలకమండలి కమిటీ సభ్యులు కూడా ప్రమాణ స్వీకారం చేస్తారని వారు తెలిపారు.

వైభవంగా శైవ మహోత్సవం

నగరి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక కామాక్షి సమేత కరకంఠేశ్వర ఆలయంలో ఆదివారం ప్రపంచ శివసేవకుల అసోసియేషన్ గుర్తింపు కార్డుల జారీ నిమిత్తం శైవ మహోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తమిళనాడు శైవ సేవకుల కో-ఆర్డినేటర్ ఈశ్వరన్ స్వామి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తమిళనాడు రాష్ట్ర శైవసేవక అసోసియేషన్ కార్యదర్శి జంబులింగం స్వామి భక్తులకు పంచపురాణం, తిరువాసగంపై ఉపదేశం చేశారు. అనంతరం అసోసియేషన్ గుర్తింపు కార్డులను సేవకులకు అందించారు. భక్తులకు అన్నదానం చేశారు. నగరి, పుత్తూరు మాణిక్య వాసగర్ శివ సేవకుల అసోసియేషన్ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బియ్యం వేసేదే ఆలస్యం

- రేషన్ సరుకులు అడిగితే లబ్ధిదారులపై డీలర్ ఆగ్రహం

గుడిపాల, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రతి నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ లోపు రేషన్ షాపులో లబ్ధిదారులకు రేషన్ అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా కొంతమంది డీలర్లు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. మండలంలోని పానాటూరు రేషన్ షాపులో ఈనెల 1న ఇవ్వాల్సిన నిత్యావసరాలను డీలర్ తన సొంత పనుల నిమిత్తం ఇవ్వకుండా బయటకు వెళ్లారు. ఆదివారం డీలర్ వచ్చిన అనంతరం చౌక దుకాణాన్ని తెరిచారు. లబ్ధిదారులకు బియ్యం మాత్రమే ఇచ్చి, చక్కెర ఇవ్వలేదు. దీంతో వారు చక్కెర గురించి అడుగగా, రెండు రోజులు పడుతుందన్నారు. ఇలా ఎందుకు చేస్తున్నారని డీలర్‌ను ప్రశ్నించగా, ఆయన ఆవేశంగా చౌక దుకాణాన్ని మూసివేసి మీకు దిక్కున్న చోట చెప్పుకోండంటూ వెళ్లిపోయారని లబ్ధిదారులు వాపోయారు.



రేషన్ షాపు వద్ద వేచి ఉన్న లబ్ధిదారులు

గంట పాటు భయాందోళనలో నగర ప్రజలు

- ఇళ్లల్లో విద్యుత్ కోత.. బయట ఉరుములు, మెరుపుల మోత..

చిత్తూర్ కలెక్టరేట్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ద్రోణి ప్రభావంతో చిత్తూరు నగర ప్రజలు గతంలో ఎన్నడూ లేని రీతిలో ఆదివారం రాత్రి 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు గంటపాటు భయాందోళనలో చిక్కుకున్నారు. రాత్రి 8 గంటల నుంచి ప్రారంభమైన వర్షం గంటన్నర తరువాత భారీ వర్షంగా మారింది. దీనికి తోడు విద్యుత్ సరఫరా నగరమంతా ఆగిపోయింది. మరోవైపు ఉరుములు మెరుపుల మోతలు క్షణక్షణం ప్రజల్ని భయానికి గురిచేశాయి. తమ ఇంటిపైనే పిడుగులు పడతాయేమో అన్న రీతిలో సాగింది. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు బిక్కుబిక్కుమంటూ రాత్రంతా కాలం గడిపారు. ఉరుముల మెరుపుల గర్జన గంట పాటు కొనసాగి 10.30 గంటల నుంచి ఆగింది. భారీ వర్షం చివరికి వర్షపు జల్లులుగా మారి కొనసాగింది. కాగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఇంటిల్లిపాది జాగరణ చేయాల్సి వచ్చింది. ఇంతటి ఉరుముల మెరుపుల గర్జన తామెన్నడూ వినలేదని భయకంపితులైన వృద్ధులు తెలిపారు.

కార్వేటినగరం'డైట్'లో అ'పూర్వ' కలయిక



35 ఏళ్ల తరువాత కలుసుకున్న ఆనాటి అధ్యాపకులు, విద్యార్థులు

వెదురుకుప్పం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యా శిక్షణా సంస్థ(డైట్)లో 35 ఏళ్ల క్రితం ఛాత్రోపాధ్యాయులుగా శిక్షణ పొందిన వారు ఆదివారం కార్వేటినగరంలో ఒక్కటయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుని, ఆనాటి స్మృతులను నెమరువేసుకున్నారు. డైట్ పూర్వ ప్రిన్సిపాల్ రంగారెడ్డి(రిటైర్డ్) మాట్లాడుతూ 35 సంవత్సరాల తరువాత 75 మంది డైట్ పూర్వ విద్యార్థులంతా తిరిగి కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. పూర్వ ప్రిన్సిపాల్ రంగారెడ్డి సహా అధ్యాపకులుగా పనిచేసిన యోగానంద నాయుడు, సుందరయ్య, చిట్టిబాబు, చంద్రయ్య, పురుషోత్తమ నాయుడును పూర్వ విద్యార్థులు సత్కరించారు. కార్యక్రమంలో డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ దామోదరం, పూర్వ విద్యార్థులు బి.చెంగల్రాజు, చెంగల్రాయులు, నీలకంఠం, లావణ్య, నరేంద్ర, భారతి, మురళి పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన తప్పనిసరి

నింద్ర, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): జీఎస్టీపై ప్రతి ఒక్కరికీ అవగాహన తప్పనిసరి అని టీడీపీ మండల కన్వీనర్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని ఒరువురుపేట పంచాయతీ మంగళగిరి కండ్రిగలో జీఎస్టీపై ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ జీఎస్టీ తగ్గడంతో నిత్యావసర వస్తువుల ధరలు కూడా తగ్గాయన్నారు. నాయకులు గంగాధరం నాయుడు, మురళీనాయుడు, రాము తదితరులు ఉన్నారు.


స్వదేశీ వస్తువులను వాడాలి

గంగాధరనెల్లూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ ఇకపై విదేశీ వస్తువుల కొనుగోలుకు స్వస్తిపలికి, స్వదేశీ వస్తువులను కొనుక్కొని దేశానికి ఆర్థిక పరిపుష్టిని కల్పించాలని పలువురు బీజేపీ నేతలు ప్రతిజ్ఞ చేశారు. గంగాధరనెల్లూరులో ఆదివారం జరిగిన సమావేశంలో రాష్ట్ర బీజేపీ ఓబీసీ కార్యవర్గసభ్యుడు ఇడగట్టి సుధాకర్, మండల పార్టీ అధ్యక్షుడు ఆనందబాబు, నేతలు మురళి, భాగ్యలక్ష్మి, ఆనందరెడ్డి, నారాయణ ఆచారి, నటరాజన్, శరవణకుమార్ పాల్గొన్నారు.

అభినందన

గంగాధరనెల్లూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ సర్వీస్ అసోసియేషన్ ఉమ్మడిజిల్లా ఉపాధ్యక్షులుగా గంగాధరనెల్లూరు ఎంపీడీవో కార్యాలయ ఏవో కడియాల లోకేష్ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా ఎంపీడీవో శేషగాని మనోహర్‌గౌడ్, ఎంఈవోలు ఆంజనేయులుశెట్టి, గుణశేఖర్‌రెడ్డి, వ్యవసాయాధికారి భవాని తదితరులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

కుక్కకాటుకు వృద్ధుడి మృతి



మునస్వామినాయుడు (ఫైల్ ఫొటో)

చిత్తూరు రూరల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని తాళంబేడు పంచాయతీ మంగాపురం గ్రామానికి చెందిన మునిస్వామి నాయుడు(75) కుక్క కాటుకు గురై ఆదివారం మృతి చెందాడు. గ్రామస్తుల సమాచారం మేరకు.. 20 రోజుల క్రితం గ్రామంలోనే మునస్వామి నాయుడిని ఓ కుక్క కరిచింది. ఆయన కూడా ర్యాబిస్ వ్యాక్సిన్ వేయించుకున్నాడు. అయితే కుక్క కరిచాక పాటించాల్సిన విధానాలను పక్కనపెట్టి వర్షంలో తిరగడం, పొలాల్లో పనిచేయడంతో తీవ్ర అనారోగ్యానికి గురై ఆదివారం మరణించారని తెలిపారు. మృతిచెందే ముందు ర్యాబిస్ లక్షణాలు కనిపించాయని గ్రామస్తులు పేర్కొన్నారు.

ఘనంగా విజయదశమి ఉత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రనాథ్

పెనుమూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ముత్యాలమ్మ గుడి ఆవరణలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో విజయదశమి ఉత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య వక్తగా హాజరైన ఆర్ఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు టి.రవీంద్రనాథ్ మాట్లాడుతూ 1976లోనే పెనుమూరులో ఆర్ఎస్ఎస్ శాఖ ప్రారంభమైందని, కొన్ని కారణాల వల్ల నిలిచిపోయిందన్నారు. గ్రామాలకు సైతం ఆర్ఎస్ఎస్ శాఖలు విస్తరించాల్సిన అవసరముందన్నారు. గోపాలకృష్ణ, జిల్లా పీఆర్వో బాబుకిరణ్, జ్ఞానేంద్ర, పరంధామయ్య, జితేంద్రపటేల్, హరికృష్ణ, జయచంద్రారెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

మినీ స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తా



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న విజయబాబు

నింద్ర, అక్టోబరు 12(ఆంధ్ర జ్యోతి): వాలీబాల్ క్రీడాకారులు సరైన ప్రతిపాదనలతో వస్తే నింద్ర మండల కేంద్రంలో మినీ స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తానని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయబాబు హామీ ఇచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో స్పైక్ వాలీబాల్ క్లబ్ టోర్నీని ఆయన ప్రారంభించి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా టోర్నీ నిర్వాహకులు మండల కేంద్రంలో 11 ఎకరాల స్థలం అందుబాటులో ఉందని విజయబాబు దృష్టికి తీసుకువచ్చారు. దానికి సమాధానంగా ఆయన మాట్లాడుతూ క్రీడాశాఖ మంత్రి, శాప్ చైర్మన్‌లను కలిసి స్టేడియం ఏర్పాటుతో పాటు క్రీడాకారుల అభ్యున్నతికి తోడ్పాడతానని తెలిపారు. కార్యక్రమంలో నింద్ర ఎస్ఐ మల్లికార్జున్, టోర్నీ నిర్వాహకులు ప్రసాద్ చౌదరి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విమర్శలు వద్దు.. అభివృద్ధికి సహకరించండి

గుడిపాల, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చిత్తూరు నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తుంటే సహకరించాలే తప్ప విమర్శలు చేయడం తగదని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, సింగిల్ విండో అధ్యక్షుడు ప్రతాప్ నాయుడు అన్నారు. ఆదివారం వారు మీడియాతో మాట్లాడుతూ చిత్తూరుకు యూనివర్సిటీ రావడానికి ఎమ్మెల్యే కృషి చేస్తున్నారన్నారు. దానివల్ల యువతకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. దయచేసి పని చేస్తున్న ఎమ్మెల్యేపై ఎవరూ విమర్శలు చేయవద్దని వారు హితవు పలికారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంయాదవ్, నాయకులు మురళి నాయుడు, రవి నాయుడు, ఐజాక్, రమేష్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

25వరకు ఈక్రాప్ నమోదు గడువు పెంపు

గంగాధరనెల్లూరు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ ఈక్రాప్ నమోదుకు ప్రభుత్వం ఈ నెల 25వ తేది వరకు గడువు పొడిగించినట్లు మండల వ్యవసాయశాఖాధికారి భవాని తెలిపారు. ఈనెల 30వతేదిలోపు ఈక్రాప్ నమోదు వివరాలను ఆయా రైతుసేవాకేంద్రాల్లో ప్రచురిస్తారని ఆమె పేర్కొన్నారు. మండలంలోని ప్రతిరైతు ఈక్రాప్ నమోదును సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

అప్రమత్తత అవసరం

నగరి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): బంగారం విలువ రోజురోజుకు పెరుగుతుండడంతో వాటిని కాపాడుకునే విషయంలో ప్రజలకు అప్రమత్తత అవసరమని సీఐ విక్రమ్ అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజల అజాగ్రత్తను అనుకూలంగా మార్చుకుంటున్న దొంగలు మూసి ఉంచిన ఇళ్లను గుర్తించి, అర్ధరాత్రి చొరబడి విలువైన ఆభరణాలు, నగదు తీసుకెళ్లిన సంఘటనలు జరిగాయన్నారు. వారిని త్వరలో పట్టుకుంటామన్నారు. ప్రజలు విలువైన ఆభరణాలు జాగ్రత్తగా లాకర్‌లో ఉంచాలని, ఇల్లు లాక్ చేసుకుని వెళ్లాల్సి వస్తే పోలీస్‌స్టేషన్‌కు కాని, ఎస్ఐ నెంబరు 9440796724కు సమాచారం ఇస్తే రాత్రి పూట గస్తీ తిరిగే సమయాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఇళ్లకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేవారు రోడ్డువైపు కూడా సీసీ కెమెరా పెట్టుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా మహాకుంభాభిషేకం



లలితా సహస్రనామ హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

విజయపురం, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూచివానత్తంలో వరసిద్ధి వినాయక స్వామి, అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహాకుంభాభిషేక కార్యక్రమాన్ని మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆలయ ఆవరణంలో వేదపారాయణం, లలితా సహస్రనామ పారాయణం, నాడీ సంధానం, కలశ ప్రాణ ప్రతిష్ఠ, సహస్రనామపూజ, మహాపూర్ణాహుతి, స్వామివారి మహాకుంభాభిషేకం, అలంకరణ, అర్చన, హారతి, తీర్థప్రసాద వినియోగ కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి స్వామివార్లను పురవీధుల్లో ఊరేగించారు. పురాణం దుర్గాప్రసాద్‌శర్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు నగరపాలక కార్యాలయంలో 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): నగరపాలక కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ నరసింహ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.